క్లుప్తంగా

తప్పిపోయిన బాలిక అప్పగింత



న్యూశాయంపేట: ములుగు జిల్లా ఏటూరు నాగారానికి చెందిన బాలిక అయేషా ఆదివారం ఉదయం తప్పిపోయింది. బాలిక తండ్రి యాకూబ్ ఫిర్యాదు మేరకు వరంగల్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్ బ్లూకోట్స్ సిబ్బంది సీసీ టీవీ పుటేజీల సాయంతో బాలిక ఆచూకీ కనుగొని యాకూబ్‌కు ఆదివారం సాయంత్రం అప్పగించినట్లు ఏనుమాముల ఎస్సై రాజు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వాజేడు : 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తూ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టబద్ధత కల్పించాలని కోరుతూ సోమవార తహసీల్దార్ శ్రీనివాస్‌కు సీపీఎం మండల నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి రఘుపతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక బీసీ జనాభా కలిగి ఉన్నప్పటికీ జనాభా ప్రాతిపదికన నిధులు, నియామకాలు, చట్టసభల్లో రిజర్వేషన్లు లేకపోవడంతో నష్టపోతున్నట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి రాజ్యాంగం ద్వారా చట్టబద్ధత కల్పించాలని అదే సమయంలో రాష్ట్రపతి ఆమోదానికి పంపించి ఆమోదింపచేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో దేవయ్య, దామోదర్, కృష్ణ బాబు ఉన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ కార్యదర్శి రాజు

ములుగు రూరల్ : ఈ నెల 19 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లా గాజులరామారంలో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని మార్కెట్ యార్డులో కార్మికులతో కలిసి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనకు పని చేసేది ఎర్ర జెండా అని అన్నారు. మహాసభలకు కార్మికులు, కర్షకులు, హమాలీలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో రమేష్, భిక్షపతి, రఘు, రాజు, కుమార్, రవి, నరేష్ పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



యువకులకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై కృష్ణప్రసాద్

వాజేడు : యువత సన్మార్గంలో నడవాలని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని రాంపురంలో సోమావరం అభయమిత్ర కార్యక్రమంలో భాగంగా యువకులతో మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి అమ్మడం, సేవించడం చేయవద్దన్నారు. అసాంఘిక శక్తులకు సహకరించవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ద్విచక్రవాహనంపై ముగ్గురు ప్రయాణించవద్దని అన్నారు. అమ్మాయిలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టం పై కేసు నమోదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా యువకులకు వాలీబాల్ కిట్ అందించారు.

ఎన్ఎఫ్‌బీఎస్ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోండి

వాజేడు : ఎన్ఎఫ్‌బీఎస్ (నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్)కు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారి ప్రాథమిక వేతన సంపాదకుడు మరణించిన వారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. మూడేళ్ల కాలంలో కాలంలో 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉన్న కుటుంబ సంపాదకుడు మృతి చెందిన వారు మాత్రమే ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తిరుగు కష్టాలు

- ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం పడిగాపులు
- ఒక వైపు పండుగ.. మరోవైపు కూలిన మల్లంపల్లి బ్రిడ్జి



ఏటూరునాగారం బస్టాండ్‌లో బస్సుల కోసం పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

ఏటూరునాగారం : ఆర్టీసీ బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. విద్యాసంస్థలకు వరుస సెలవులు, పండుగలు రావడంతో వారి సొంత ఊళ్లకు విద్యార్థులు, బంధువులు వచ్చారు. సోమవారం తిరుగు ప్రయాణంలో అనేక కష్టాలను పడుతూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. వరలక్ష్మీ వ్రతాలు, రాఖీ పౌర్ణమి వేడుకలు ముగియడంతో తిరుగు ప్రయాణం చేసేందుకు బస్సుల్లో ఎక్కేందుకు ప్రయాణికులు కుస్తీ పట్టారు. మహిళలకు ఉచిత ప్రయాణం కావడంతో ఎక్కువ మంది వారే ప్రయాణం చేయడం గమనార్హం. సీట్ల కోసం బస్సు కిటికీల నుంచి వారి సామగ్రిలను సీటులో వేసుకొని సీటు ఆపుకునేందుకు నానా తంటాలు పడ్డారు. బస్సుల్లో సీట్లు లేకున్నప్పటికీ నిలబడి ప్రయాణించేందుకు కూడా ప్రయాణికులు వెనుకాడడం లేదు. దీనికి తోడు జిల్లాలోని మల్లంపల్లి మండలంలో బ్రిడ్జి కూలిపోయేందుకు సిద్ధంగా ఉండడంతో ఆర్టీసీ బస్సులను పందికుంట మీదుగా వరంగల్‌కు మళ్లించడంతో హనుమకొండ నుంచి వచ్చే బస్సులు మరింత ఆలస్యం కావడంతో ప్రయాణికుల కష్టాలు అన్నీ ఇన్ని కావు. ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం(కె), కన్నాయిగూడెం నుంచి వచ్చిన ప్రయాణికులు ఏటూరునాగారంలో వేచి బస్సుల్లో ప్రయాణించేందుకు వేచి చూశారు. సెలవులు, పండుగ సమయంలో బస్సు సర్వీసులను మరిన్ని పెంచి తమ కష్టాలు తీర్చాలని ప్రయాణికులు వాపోతున్నారు.



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

బస్సు సౌకర్యం కల్పించాలి



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి

వెంకటాపురం(కె) : విద్యార్థులకు పాఠశాల సమయంలో బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆలుబాక గ్రామంలో ఆర్అండ్‌బీ రహదారిపై రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ ఎదిర, సూరవీడు, అబ్బాయిగూడెం గ్రామాల నుంచి ఆలుబాక జిల్లా పరిషత్ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పాఠశాల సమయానికి బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు లేక ఆటోలో రావడానికి రోజుకు రూ.100 ఖర్చు పెట్టాల్సి వస్తుందన్నారు. నిరుపేద విద్యార్థులు డబ్బులు లేక చదువులు మానేసే దుస్థితి ఏర్పడిందని అన్నారు. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమండ్ చేశారు. లేని పక్షంలో దశల వారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

డీఆర్డీఓను కలిసిన ఉద్యోగ సంఘం నేతలు



డీఆర్డీఓ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

ములుగు రూరల్ : గ్రామీణాభివృద్ధి సంస్థ డీఆర్డీఓ బాధ్యతలు చేపటిన శ్రీనివాస్‌ను ఉపాధి హామీ ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. సన్మానించిన వారిలో ఏపీడీ వెంకట నారాయణ, ములుగు ఉద్యోగుల జాక్ చైర్మన్ నారగోని సునీత, ఏపీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోత్ రాజు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్, టెక్నికల్ అసిస్టెంట్ సంఘం జిల్లా కార్యదర్శి సురేష్, ఉన్నారు.

వేతనాలు ఇచ్చి ఆదుకోవాలి

ఏటూరునాగారం : మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బలుసుపాటి నరేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు తాగునీరు అందిస్తున్న భగీరథ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా వారి కష్టాన్ని దోచుకుంటున్నారన్నారు. నాలుగు నెలల నుంచి వేతనాలు అందక సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. కేబీఎస్ఆర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ నీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న కార్మికులతో సంస్థ పని చేసుకుంటుందని, వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వెంటనే వేతనాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జస్వంత్, నవీన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరేశ్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(కె): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి జ్యోతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బెస్తగూడెం, పర్శికగూడెం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. బెస్తగూడెం పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను వేశారు. వైద్యాధికారులు భాస్కర్, ఆశీష్, డీపీఎంఓ సత్యనారాయణ, యాకలక్ష్మి, హెచ్ఈఓ కోటిరెడ్డి పాల్గొన్నారు.

రైతు వేదికకు దారేది ?

- గాలికి కొట్టుకుపోయిన రేకులు
- ఇబ్బంది పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

చిట్యాల : మండలంలోని ఒడితల గ్రామంలో ఉన్న రైతు వేదిక ఊరికి దూరంగా బండరాళ్లపై లక్షలు వెచ్చించి నిర్మించారు. దీంతో రైతువేదికకు సరైన దారి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం 2021 సంవత్సరంలో మండలంలోని ఐదు క్లస్టర్లలో (చిట్యాల,ఒడితల, నైన్‌పాక, చైన్‌పాక, జూకల్) రైతు వేదికలను నిర్మించింది. రైతులు తమ సమస్యలను అధికారులు గుర్తించి తగిన సలహాలు, సూచనలు తెలుసుకోవచ్చని రైతులు సంబురపడ్డారు. కానీ వారి ఆనందం మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. గత ఏడాది క్రితం గాలివాన బీభత్సానికి ఒడితల రైతు వేదికపైన ఉన్న రేకులు కొట్టుకపోయాయి. ఏవైనా సమావేశాలు నిర్వహించాలంటే అనేక అవస్థలు పడుతున్నారు.



అధ్వానంగా రైతు వేదిక

రైతువేదికకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకరావాలని రైతులు కోరుతున్నారు.

మౌలిక వసతులు కరువు

రైతు వేదికలో కనీస మౌళిక వసతులు లేకపోవడంతో సంబంధిత అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటికి అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. అలాగే రైతు వేదిక నిర్మాణానికి నాసిరకం పనులు చేయడంతో వేదిక ముందు మెట్లు కూలిపోయాయి. దీంతో రైతు వేదిక అధ్వానంగా తయారైంది.

నేడు మల్హర్‌రావు జయంతి

మల్హర్ : కొయ్యూరు సెంటర్‌లో మాజీ ఎంపీపీ మల్హర్‌రావు జయంతి వేడుకలు నేడు (మంగళవారం) నిర్వహించనున్నట్లు మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాస రావు సోమవారం ఒక ప్రకటనలో తెలి పారు. వేడుకలకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, మాజీ జెడ్పీచైర్మన్ జక్కు శ్రీహర్షిణి రాకేష్‌లు హాజరుకానున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు వైద్యశిబిరం

మల్హర్ : మండలంలోని రుద్రారంలో నేడు (మంగళవారం) వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి వినయ్‌భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలి పారు. రుద్రారం పల్లె దవాఖాన (సబ్ సెంటర్)లో ఉదయం 9 గంటలకు వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో వివిధ పరీక్షలు నిర్వహించి అవసరమై రోగులకు మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మంగపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి సోమవారం పరామర్శించారు. నర్సింహాసాగర్‌లో కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బెల్లికుమార్, ఇటీవల మృతి చెందిన పొర్ల ఐలమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అదే విధంగా స్నేహితుల దినోత్సవం రోజు స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లి గౌరారంవాగులో మునిగి మృతి చెందిన బూర్గుల అభిషేక్, పొలంలో ట్రాక్టర్‌తో దమ్ముచేస్తున్న క్రమంలో ఫిట్స్ వచ్చి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కేజీవీల్స్ కిందపడి మృతి చెందిన దీకొండ శేషు, ఈనెల 4న కమలాపురంలో ఆత్మహత్యయత్నానికి పాల్పడి వైద్యం పొందుతూ మృతి చెందిన కౌలు రైతు పరమాత్ముల సమ్మయ్య, బోయి నారాయణ మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి రాజుయాదవ్, మంగపేట ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ తోట రమేష్, వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, జిల్లా నాయకులు తుమ్మ మల్లారెడ్డి, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బాడిష నాగరమేష్, చిట్టిమళ్ళ సమ్మయ్య, తదితరులు ఉన్నారు.



నర్సింహాసాగర్‌లో బెల్లికుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాగజ్యోతి

వేతనాలు విడుదల చేయాలి

ములుగు రూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఎఫ్‌డీహెచ్ఎస్ 104 సర్వీసెస్‌లో పని చేస్తున్న ఉద్యోగుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఆ సంఘం నాయకుడు రమేష్ అన్నారు. సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కంటిన్యూషన్ ఆర్డర్లు ఇప్పించాలని కోరారు. స్పందించిన మంత్రి సీతక్క హెల్త్ మినిస్టర్‌తో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో 104 ఉద్యోగులు సురేందర్, శంకర్, కిరణ్, సతీష్, సుజాత, ప్రశాంతి, రాంరెడ్డి, విజయరామారావు తదితరులు ఉన్నారు.



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

కేంద్రం బీసీలపై ద్వంద్వ వైఖరి మానుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి.దావూద్



డీటీ రాహుల్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఏటూరునాగారం: కేంద్రం ప్రభుత్వం బీసీలపై ద్వంద్వ వైఖరి మానుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి.దావూద్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రాహుల్‌కు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేస్తే 56 శాతం బీసీలు ఉన్నట్లు తేలిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఉన్నప్పటికీ బీసీ రిజర్వేషన్‌పై నోరు మెదపడం లేదన్నారు. రిజర్వేషన్ పెంచకపోతే తిరుగుబాటు తప్పదన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ఆమోదం తెలపాలని కోరారు. కార్యక్రమంలో గడ్డం కొండల్, దామోదర్, రఘుపతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే ఉన్నతస్థాయికి..

- జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విపిన్ కుమార్



వెంకటాపురం(ఎం) : విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ విపిన్ కుమార్

వెంకటాపురం(ఎం) : విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే సమాజంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విపిన్ కుమార్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగులు చిన్న పేగులో స్థావరాన్ని ఏర్పరచుకొని, భుజించిన ఆహారంలోని పోషక పదార్థాలను తినడం మూలంగా, విద్యార్థిని విద్యార్థులు రక్తహీనతకు గురై, శారీరకంగా, మానసికంగా పెరుగుదల ఆగిపోవడం, కడుపునొప్పి వికారం, తలనొప్పి తదితర లక్షణాలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు భోజనం చేసేటపుడు సబ్బుతో చేతులను శుభ్రపరచుకోవాలని సూచించారు. మండలంలో 4,766 మంది విద్యార్థులకు గాను 4,037 విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించామని, మిగతా విద్యార్థులకు ఆగస్టు 18న మాత్రలు అందిస్తామని వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చీర్ల శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ రణధీర్, పాఠశాల హెచ్ఎం రాధిక, డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పూర్ణ సంపత్ రావు, శ్రీనివాస్, ఏఎన్ఎంలు అనురాధ, స్వప్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ మాత్రలు వేసుకోవాలి

వెంకటాపురం(కె): 19 సంవత్సరాల లోపు పిల్లలు అందరూ తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ కోరం క్రాంతికుమార్ అన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మీనగరం బాలు ఆశ్రమపాఠశాలో నులిపురుగుల నివారణ మాత్రలు వేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు మాత్రలను మింగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భోజనానికి ముందు శుభ్రంగా చేతులు కడుక్కోవాలని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. అనంతరం పాఠశాలలో వంట గదిని పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం బాబురావు, ఉపాధ్యాయులు సరిత, కుమారస్వామి, మహేందర్, వైద్య సిబ్బంది కోటి రెడ్డి, యాకలక్ష్మి, ఓం ప్రకాష్, సూర్యకుమారి, నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

వాజేడు : నులి పురుగులను నివారణతో ఆరోగ్యం బాగుంటుందని స్థానిక ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవం నేపథ్యంలో సోమవారం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీ, బాలికల మినీ గురుకులం, కేజీబీవీల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మహేందర్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

మంగపేట : నులిపురుగుల నివారణతో పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున అన్నారు. చుంచులపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేయించారు. బ్రాహ్మణపల్లి, మంగపేట పీహెచ్‌సీల పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలను వేయించారు. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు, పాల్గొన్నారు.



వెంకటాపురం(కె): హాస్టల్‌లో వంటగదిని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్



వాజేడు : కేజీబీవీలో మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది



మంగపేట : విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి యమున

ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో ఓ సీనియర్ ఉద్యోగి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న విషయంపై దేవస్థానం ఈఓ చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల ప్రధానకార్యదర్శి బొల్లం కిషన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆ ఉద్యోగిపైన పలు ఆరోపణలు వస్తున్నా విచారణ జరుపకుండా తాత్సారం చేస్తున్నారని అన్నారు. ఈఓ స్పందించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఈఓ కార్యాలయం ఎదుట ఆందోళ చేపడుతామని పేర్కొన్నారు.

'ఈఓ స్పందించాలి'

కాళేశ్వరం దేవస్థానంలో ఓ సీనియర్ ఉద్యోగి తీరుతో ఆలయ ప్రతిష్ట దిగజారిపోతుందని, ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో ఈఓ స్పందించకపోవడం ఏంటని సోమవారం ప్రకటనలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ అన్నారు. ఆ ఉద్యోగిపై తగు చర్యలు తీసుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.